# వ్యాస కౌముది



## మనభారతం

డా.వల్లూరుపల్లి శివాజీరావు

75

**తొలి మాట:** *ప్రపంచ పాఠకులను విశేషంగా ఆకర్షించి, ఆకట్టుకుని, వారిచేత ఆదరించబడుచున్న, అసమాన తెలుగు మాస పత్రిక "**కౌముది**' లో ప్రచురితమైన నా 'మనభారతం' వ్యాసం జనవరి 2010 నుండి డిసెంబర్ 2015 వరకు నిరాటంకంగా 72 నెలలు ప్రచురితమయింది.* కాని సమయాభావం వల్ల జనవరి 2016 నుంచి కొన్ని బాధ్యతలవల్ల ఈ వ్యాసాలు కొనసాగించుటకు వీలు కాలేదు.

*ఇప్పుడు సమయం దొరికినందువల్ల 'కిరణ్ ప్రభ' గారి సమ్మతితో భారత విశేష చరిత్ర ను ప్రతిబింబించే ఈ 'మన భారతం' వ్యాసం ఈ సంచిక ద్వారా ఈ వ్యాసంతో మళ్ళీ కొనసాగిస్తున్నాను.*

# చేజారిన భారతదేశ రత్నరాజములు-3



### నీల వజ్రం-1 (Blue Diamond/Hope Diamond)

భారతావని, ముఖ్యంగా ఆంధ్రావని చేజార్చుకున్న వజ్రాలలో 'కోహినూర్' తరువాత అతిముఖ్యమైనది "నీల వజ్రం"(Blue Diamond). ఇది ప్రపంచంలో 'హోప్ వజ్రం (Hope డైమండ్) గా పేరు గాంచింది. ఈవజ్రం 1642 వరకు కాకతీయులు నిర్మించిన రామాలయంలో ఉన్న సీతా మాత విగ్రహంలో భృకుటి భాగంలో అమర్చబడి, నీలకాంతులను వెదజల్లుతూ ఉండేది.

ఈ అసమాన నీల వజ్రం సుమారు 110 కోట్ల (1.1 బిలియన్) ఏళ్ల క్రితం గుంటూరు జిల్లాలోని కొల్లూరు గనుల భూగర్భంలో ఏర్పడింది. అన్ని వజ్రాలవలె ఇదికూడా కర్బన (కార్బన్) అణువుల బంధన శక్తి (atom bonding లేక chemical bonding) తో సంఘటితంగా తయారుకాబడింది. ఇది మొదట 'కింబర్లైట్ ' (kimberlite) అనే ఖనిజంలో ఇమడబడింది.

అందులో నుంచి బయటకు తీసి శుద్ధిపరచిన తరువాత ఇది అద్భుత కాంతిని వెదజల్లే వజ్రంగా తయారైంది. ఈ వజ్రంలో అతి తక్కువ మోతాదులో 'బోరాన్' (Boron) అణుసముదాయం కలిసి యున్నందువల్ల ఇది ఒక అపూర్వమైన నీలం (blue) రంగు వెదజల్లుతూ ఉంటుంది. కొల్లూరు గనులనుండి

బయల్పడిన ఈవజ్రంతో పాటు అనేక ఇతర వజ్రాలుకూడా కాకతీయుల ఆస్తులుగా మరి, కాలక్రమేణా గోలకొండ సుల్తానుల పరమయ్యాయి.

17వ శతాబ్దంలో గోలుకొండ సుల్తానుల పరిపాలనాకాలంలో ఫ్రెంచి వజ్రాల వ్యాపారి 'Jean Baptiste Tavernier' 1640 –1668 మధ్య అయిదుసార్లు భారత్ ను సందర్శించాడు. 1652–1655 మధ్య చేసిన యాత్రలో ఈయన మచిలీపట్టణం, గండికోట, గోలకొండ, సూరత్, అహ్మదాబాదు, ఇతర ప్రాంతాలను సందర్శించాడు. ఆ తరువాత మరో రెండుసార్లు వచ్చి ఈప్రాంతాల లోనే తిరిగాడు.

ఆఖరియాత్ర లో ఇతను గోలుకొండ రాజ్యంనుంచి అనేక వజ్రాలను, వజ్రాభరణాలను దొంగిలించి ఫ్రాన్స్ కు పారిపోయాడు. వీటిల్లో ఉన్నవి 112.23 క్యారెట్లు బరువున్న నీల వజ్రం, దీనితో పాటు, 44 పెద్ద, 1,122 చిన్న వజ్రాలుకూడా ఉన్నాయి. వీటిన్నన్నిటిని Tavernier 1655 లో ఫ్రాన్స్ (France) కు చేరవేశాడు.

Tavernier ఫ్రాన్స్ రాజు Louis XIV కు ఈ వజ్రాలన్నిటినీ 1669 లో అమ్మాడు. వీటిల్లో 'నీల వజ్రం' ఖరీదు 220,000 livres (ఇప్పటి విలువ ప్రకారం ఇది 500 మిల్లియన్ డాలర్లకు సమానం) గా నిర్ణయించ బడింది. ఇది 480 కిలోల మేలిమి బంగారం వేలకు సమానం! అంతే కాదు. ఈ ఘన చౌర్యానికి ప్రతిఫలంగా Tavernier కు జీవితాతం రాచరపు వ్యక్తి గుర్తింపును ప్రసాదించాడు ఫ్రాన్స్ రాజు. కాని ఈ భారత వజ్రాల చోరుడు 1689 లో ఫ్రెంచి విప్లవకారులు అడవి శునకాలతో కరిపించిన కారణంగా 84 ఏట ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది. పాపం పండిందన టానికి ఇక ఒక ఉదాహరణేమో!!



1673 లో Louis XIV తన ఆస్థాన వజ్రాల నిపుణుడు 'Sieur Pitau' పిలిచి ఈ నీలం మణిని కత్తి రించి దాని కాంతిని ద్విగుణీకృతం చేయమని ఆదేశించాడు. దీని ఫలితంగా అది సన్నబడి కేవలం 67.125 కారెట్లున్న ముక్కోణాకారపు వజ్రంగా మారింది.

అప్పటినుంచి ఈ రాజాస్థానపు వజ్రాల జాబితాలో మన 'నీల మణి' వజ్ర రాజంగా వెలుగొందింది. దీనికి ఇంగ్లీషు చరిత్రకారులు 'French Blue' అని నామకరణం చేశారు. ఇది ఒక పావురం గ్రుడ్డు పరిమాణంలో ఉంది. ఈ విధంగా పరిమాణం తగ్గించబడిన ఈ వజ్రం కంఠానికి గ్రహించి, బంధించి రెండవ వైపునుంచి 'నీల ధూసర' (bluish-grey) కిరణాలను ప్రతిబింబిస్తుంది. ఆ తరువాత ఈ నీలమణి బంగారంతో పొదగబడి ఒక కంఠా భరణంలో ప్రస్ఫుటంగా కనిపించే వజ్రమయింది. దీనిని రాజు ఉత్సవ సందర్భాలలో మాత్రమే ధరించేవాడు.

Louis XIV 1715 లో మరణించిన తరువాత ఈ నీల వజ్రాభరణం అతని పుత్రుడు, ఆతరువాత సింహాసనమెక్కిన Louis XV ధరించాడు. 1749 లో ఈయన ఆస్థాన వజ్రాల నిపుణుడు 'Andre Jacequemin' నైపుణ్యంతో 83 ఎర్ర, 112 పసుపు పచ్చ రాగుల చిన్న వజ్రాల సముదాయంతో ఒక pendant ను తయారు చేయించి దాని మధ్యలో నీల వజ్రాన్ని పొదగబడేటట్లు చేసాడు. ఈ pendant 'Order of the Golden Fleece' (ఫ్రెంచ్: Ordre de la Toison d ' Or) గా పేరొందింది (**క్రింది బొమ్మ చూడండి**). Louis XV మరణం (1774 లో) తరువాత ఈ వజ్రం 'Louis XVI ' పరమయింది.



ఈ ఫ్రెంచి రాజు సతీమణి 'Marionne Antionette' అనేక రాజభరణాలతో పాటు ఈ నీల వజ్రమున్న pendant ను కూడా తరచూ ధరించేది. 1787 లో కొన్నాళ్ల పాటు ఫ్రెంచి శాస్త్ర వేత్త మన తెలుగునాటి వజ్రం మీద విస్తృత పరిశోధన చేసాడు.

1789 నుంచి ఫ్రాన్స్ లో విప్లవం ప్రారంభమయింది. ఫలితంగా 1792 లో సెప్టెంబర్ 11 న Loius XVI ఆయన, రాణి, వారి కుటుంబసభ్యులందరు కారాగారంలో బంధింపబడ్డారు. ఇదే సమయమనుకుని విప్లవ కారులు, దొంగలు రాజా సంపదతో పాటు అనేక రాజభరణాలను స్వాధీనం చేసుకున్నారు. రాజు Loius XVI కి 21 జనవరి 1793 తేదీన, రాణి Marie Antionette కి 16 అక్టోబర్ 1693 తేదీన మరణదండనలు విధింప బడ్డాయి.

ఈభారీ విధ్వంసం, దొగతనానికి ముందే ఒక గజ దొంగ 'Cadet Guillot ' కొన్ని వజ్రాభరణాలను రాజ ప్రాసాదంనుంచే తస్కరించాడు. వీటిల్లో నీల వజ్రమున్న pendant కూడా ఉంది. వీటినన్నిటిని Guillot లండన్ చేరవేశాడు.

**మీ అభిప్రాయాలను పంపించేందుకు నా ఇ-మెయిల్: dr_vs_rao@yahoo.com**

COMMENTS